కెరటం

నమస్తే తెలంగాణ
సోమవారం 20 జూన్ 2011 హైదరాబాద్

జిందగీ
colors of telangana



వర్క్ యాటిట్యూడ్

# ఈక్యూ ఉంటేనే....



**చే**స్తున్న ఉద్యోగానికి క్వాలిఫికేషన్, ఐక్యూలు ఎంత అవసరమో దాని ఎదుగుదలకు ఈక్యూ (ఎమోషనల్ ఇంటలిజెన్సీ) కూడా అంతే అవసరం. పనిచేసే చోట కొలీగ్స్‌తోగాని, సంస్థ విషయంలో గానీ సానుకూలంగా ఉండకపోతే అది కెరీర్‌నే కుంటుపరుస్తుంది. మన ప్రవర్తన కెరీర్‌పై ఎలా ప్రభావం చూపుతుందో తెలుసుకోవాలంటే ఈ ముగ్గురి అనుభవాలను తెలుసుకోవాల్సిందే.

**ప్రోత్సాహంతోనే బెటర్‌మెంట్**

రమణారావు ఓ పెద్ద కంపెనీలో జనరల్ మేనేజర్. తన కింద పనిచేసే సహోద్యోగులతో చక్కగా పనిచేయించగల సమర్థుడు. కానీ తన సబార్డినేట్లలో ఉండే నైపుణ్యాలను ఎంకరేజ్ చేసే మనస్తత్వం కాదు. వాళ్లని పొగిడితే తరువాత మాట వినరేమోనని ఆయన భయం. అతని దగ్గర పనిచేసే వేణు మంచి పనిమంతుడు. క్రీడాకారుడు కూడా. ఓసారి కంపెనీ తరపున ఫుట్‌బాల్ ఆడి విజయం సాధించాడు. ఆ విజయోత్సాహంతో షీల్డు పట్టుకుని తన దగ్గరికి రాబోతున్న వేణును లోపలికి రానివ్వలేదు సరికదా ఫోన్‌లో కూడా మెచ్చుకోలేదు. దాంతో వేణు చాలా అసంతృప్తికి లోనై, బాస్ తనను పట్టించుకోలేదన్న అసంతృప్తితో పని మీద శ్రద్ధ చూపడం మానేశాడు. సంస్థలో పనిచేస్తున్నప్పుడు తోటి ఉద్యోగులు, బాస్‌లతో సౌకర్యవంతంగా ఫీలయినప్పుడే తమ పూర్తి సామర్థ్యం బయటపెడతారు. 'గుర్తింపు లేని పని ఎంత చేసినా వ్యర్థమే' అన్న భావన వేణులో కలిగింది. అందుకే సమయం చూసుకుని వేరే సంస్థకి మారిపోయాడు. ఫలితంగా రమణారావు మంచి ఉద్యోగిని కోల్పోయాడు.

**లీడర్‌కి స్వార్థం ఉంటే...**

మీనాక్షి ఓ సంస్థలో టీమ్ లీడర్. ఆమెకున్న కమ్యూనికేషన్ స్కిల్స్‌తో తన పై ఉద్యోగుల దగ్గర మంచి పేరు, నమ్మకం సంపాదించింది. ప్రతి నెలా ఆమె తన బాస్‌కి ఇచ్చే రిపోర్టులో తనే చాలా కష్టపడుతున్నాననీ, సబార్డినేట్స్ ఎవరూ పూర్తి స్థాయిలో నైపుణ్యం సంపాదించలేకపోతున్నారనీ చెబుతూ ఉండేది. దానివల్ల తనకే గుడ్‌విల్ ఉంటుందని ఆమె ఉద్దేశం. ఆమె మాటలన్నీ నిజమేననుకునేది మేనేజ్‌మెంట్. కానీ ఆ ప్రవర్తనతో విసిగిపోయిన ఆమె టీంమెంబర్స్ అందరూ వేరేచోట ఉద్యోగాలు చూసుకున్నారు. చివరికి ఆమె డిపార్ట్‌మెంట్‌నే మూసేయాల్సి వచ్చింది. అందుకే మార్కస్ బకింగ్‌హామ్ అంటాడు 'ఉద్యోగులు మేనేజర్లను వదిలేస్తారు గానీ కంపెనీలను కాదు' అని.

**మాట తూలితే...**

వివేక్ ఇటీవలే ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో జాయిన్ అయ్యాడు. అందులో అతనూహించిన వాతావరణం లేదు. దాంతో అసహనానికి లోనైన ఆయన ఆ కంపెనీ గురించి చెడ్డగా మాట్లాడడం మొదలుపెట్టాడు. కంపెనీ నచ్చకపోతే వేరేచోట చేరమని సూచించారు స్నేహితులు. కానీ వివేక్ పట్టించుకోలేదు. కొంతకాలానికి దాని ప్రభావం ఆ కంపెనీ ఆర్థిక వ్యవస్థ పై పడి చాలామంది ఉద్యోగాలు కోల్పోయారు. వివేక్‌కి ఉద్యోగం పోకపోయినా అంతకుముందు కన్నా జీతం తగ్గింది. అప్పుడు తెలిసింది తను ఎంత తప్పు చేశాడో!

కాబట్టి వర్క్ ప్లేస్‌లో మనం ఎలా ఉంటే మన పొజిషన్ మరింత అభివృద్ధిలోకి వస్తుందో గమనించుకోవాలి. చక్కగా మసలుకోగలిగితేనే మన కెరీర్ మన చేతుల్లో ఉంటుంది.

– డాక్టర్ కల్యాణ చక్రవర్తి తిరునగరి
ప్రొఫెసర్ అండ్ కార్పొరేట్ ట్రెయినర్–బిజినెస్ కమ్యూనికేషన్ అండ్ సాఫ్ట్ స్కిల్స్ ట్రెయినింగ్ హైదరాబాద్.